క్లుప్తంగా

కళాశాలలో బొడ్డెమ్మ వేడుకలు



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య ఆధ్వర్యంలో గురువారం బొడ్డెమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఆటపాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు రాములు నాయక్, భిక్షం, శ్వేత, రాజ్ కుమార్, రాజు, అశోక్ శ్రీలత, నాగరాజు, హరికృష్ణ, దివ్య పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో ఎంపీటీసీ బీర బోయిన పార్వతి, చీకుపల్లి సర్పంచ్ కోరం సమ్మక్క చేతుల మీదుగా గురువారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతరానికి అవకాశం ఇద్దాం..

ములుగు: నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో యువతకే ప్రజలు పట్టం కట్టాలని టీఎస్ టీడ బ్యూటీయా రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేయనున్న నాగజ్యోతిని గెలిపించాలన్నారు. నాగజ్యోతిని గెలుపించుకుంటే నియోజకవర్గం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా, ములుగు మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలోని మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటాపురం మండలంలోని లక్ష్మీదేవిపేటలో చిందు మాదిగ గద్దం వెంకటేశ్వర్లు కుటుంబాన్ని కృష్ణ ప్రసాద్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట కొట్టిపాక ప్రభాకర్, సింహాద్రినరహరి, తదితర నాయకులు నియోజకవర్గంలోని మంగపేట మండలం వరకు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులను కలిస్తు సుడిగాలి పర్యటన చేశారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది



వెంకటాపురం(కె): వెంకటాపురం అంగన్ వాడీ ప్రాజెక్టు పరిధిలోని వాజేడు మండలానికి చెందిన 74, వెంకటాపురం మండలానికి చెందిన 94 అంగన్ వాడీ కేంద్రాలకు చెందిన అంగన్ వాడీటీచర్లు, ఆయాలు గురువారం విధుల్లో చేరారు. ఈ మేరకు సీడీపీఓ శిరీషకు జాయినింగ్ అవుతున్నట్లుగా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మీనాకుమారి, అరుణ కుమారి, సమ్మక్క తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



వాజేడు: మండల పరిధిలో ముత్తారం కాలనీ గ్రామానికి చెందిన కంటి సమ్మక్క ఇటీవల మృతి చెందింది. సమ్మక్కకు ముగ్గురు ఆడ పిల్లలు కాగా ఆమె భర్త రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడు. దీంతో వారి ముగ్గురు ఆడ పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆదేశాల మేరకు సంస్థ మండల కోఆర్డినేటర్ కామేష్, యానిమేటర్ భాస్కర్ 25 కేజీల బియ్యం అందజేశారు.

దోమల నివారణ మందు పిచికారీ

వాజేడు: మండల పరిధిలో గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామంలో గురువారం దోమల మందును పిచికారీ చేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఇద్దరు మనుషులతో కలిసి కాలినడకన గుట్ట పైకి చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేసి గురువారం ఉదయం గ్రామంలోని అన్ని ఇళ్లల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

నేడు వాహన వేలం

మహదేవపూర్: మండలంలో గుడుంబా తరలిస్తూ పట్టుబడిన వాహనానికి నేడు(శుక్రవారం) వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు పట్టుబడిన పల్సర్ బైక్‌ను వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి



మంగపేట: ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు

మంగపేట: ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బైరి వీరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పర్వీనా మాట్లాడుతూ.. సంవత్సరం క్రితం ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేతనాలు పెంచుతూ జీఓ నంబర్ 08ని విడుదల చేసి నేటి వరకు పెంచిన వేతనాలను చెల్లించలేదన్నారు. ఇప్పటికే ఐదు నెలలుగా వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేనిపక్షంలో ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేపడతమాన్ని హెచ్చరిస్తూ అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, జయమ్మ, కలమ్మ, సమ్మక్క, పద్మ, కాంతమ్మ, సుధ, స్వరూప, భారతి, నాగలక్ష్మి, మాణిక్యం, సారవ్వ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు ఇవ్వాలని వినతి

వెంకటాపురం(ఎం): వంట కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని కోరుతూ గురువారం ఎంఈఓ శ్రీనివాసులుకు ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య మాట్లాడుతూ.. కార్మికులు 16 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పెంచిన వేతనాలను ఇప్పటివరకు ఖాతాల్లో జమ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జనగాం శోభ, పోశమ్మ, ప్రమీల,రమ, రజిత, శ్రీదేవి పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పండ్ల పంపిణీ

వెంకటాపురం(కె): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు మండల కేంద్రానికి చెందిన పండ్ల వ్యాపారి సెనిగల నర్సింహారావు రూ.ఐదు వేల విలవ చేసే పండ్లను అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రాంబాబు, సమ్మక్క, నాగమణి, అమ్మాజీ, రాధ ఉన్నారు.

రైతుల రుణమాఫీపై ప్రభుత్వ నిర్లక్ష్యం



నిరసన తెలుపుతున్న రైతులు

ఏటూరునాగారం: రైతుల రుణ మాఫీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసినా ఇంత వరకు రుణాలు రెన్యూవల్ చేయలేదని రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు వడ్కాపురం సారయ్య అన్నారు. గురువారం మండలంలోని చిన్నబోయినపల్లిలో రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలను గత నెలలో రైతుల ఖాతాలో ప్రభుత్వం డబ్బు జమ చేసిందన్నారు. కానీ రైతులకు మళ్లీ బ్యాంక్ అధికారులు రుణం ఇవ్వడం లేదన్నారు. బ్యాంక్ అధికారులు రైతులకు లేనిపోని మాటలు చెప్పి ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బును వారే నిల్వ చేసుకుంటున్నారని ఆరోపించారు. రుణాలు మాఫీ మళ్లీ రుణాలు ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.

రైతు కొడుకు కానిస్టేబుల్



ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన రైతు ఆకుదారి రామయ్య–సమ్మక్కల కుమారుడు ఆకుదారి కల్యాణ్ కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యాడు. దీంతో గ్రామస్తులు, పలువురు కల్యాణ్‌ను అభినందించారు. కల్యాణ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివాడు.

బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న లాలయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన తాడ్వాయి పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇందారాపు లాలయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం హనుమకొండలో హరిత హోటల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ల సమక్షంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, తగిన గౌరవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, రెడ్ కో చైర్మన్ సతీష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, గ్రంథాలయ చైర్మన్ పారిక గోవింద్‌నాయక్, మూడు మండలాల ఇంచార్జి మెట్టు శ్రీనివాస్ గారు, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

మరమ్మతు పేరుతో ప్రజాధనం వృథా



రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాపురం(ఎం): ధ్వంసమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పేరుతో బీఆర్ఎస్ నాయకులు రూ.లక్షలు దండుకుని ప్రజాధనం వృథా చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జవహర్‌లాల్ ఆరోపించారు. నెలరోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల మారెడుగొండ చెరువుకు గండి పడి కొట్టుకుపోయిన లక్ష్మీదేవిపేట–బుర్గుపేట గ్రామాల మధ్య ఉన్న రోడ్డును బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ..నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులతో బీఆర్ఎస్‌కు చెందిన కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా శాశ్వతరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని లేనట్లయితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, వైద్యుల తిరుపతిరెడ్డి, తక్కెళ్లపల్లి సుమన్‌రావు, దేవేందర్ గౌడ్, సంజీవరెడ్డి, వేల్పుల శ్రీనివాస్, చందు, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై నిరసన



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను పలువురు గ్రామస్తులు గురువారం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం మంజూరు కోసం చేసిన దరఖస్తులను పరిశీలించేందుకు సర్వేకు వచ్చిన అధికారులు దివ్యాంగులు, వితంతువులు, నిరుపేదల కోటా ఉంటుందని చెప్పారని అలాంటిది ఏమీ లేకుండా అర్హులైన దళితులకు మోసం చేసి అగ్రకులాలకు మంజూరు చేయడం ఏంటని ప్రశ్నించారు. గ్రామానికి 36 ఇండ్లు మంజూరీ అయినప్పటికి అందులో దళితులకు 03 ఇండ్లు మాత్రమే మంజూరు చేశారని మిగిలిన 33 అగ్ర కులాలవారికే ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి గ్రామసభ ద్వార అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు బోడ జయరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారి సురేంద్రబాబు, చిన్నపెల్లి రాంబాబు, బోడ బొర్రయ్య, గోనె నాగేష్, తిరుపతి, కిరణ్, లక్ష్మీనారాయణ, సతీష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన మెట్టుపల్లి, కాసులపాడు, పోతుగల్లు,అంకుషాపురం, పాత ఇస్సిపేట గ్రామాల్లో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లోని మహిళలకు బతుకమ్మ చీరలను, కుట్టు మిషన్లు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మకుండా చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఏ గ్రామం నుంచి ఎక్కువ మెజార్టీ ఓట్లు వస్తే ఆ గ్రామానికి రూ.10 లక్షల నగదు పురస్కారాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ చైర్మన్ కొడారి రమేష్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బలుగూరి తిరుపతి రావు ఉన్నారు.

ఆట వస్తువుల పంపిణీ



వెంకటాపురం(కె): స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ సతీష్‌కుమార్



వాజేడులో..

వాజేడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆట వస్తువులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో యువత ఆడుకోవడానికి ప్రభుత్వం ద్వారా వచ్చిన క్రీడా సామగ్రిని ఎంపీపీ శ్యామల శారద, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత చేతుల మీదుగా సర్పంచ్‌లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, వైద్యాధికారి మహేందర్ ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయలంలో గురువారం తెలంగాణ క్రీడా ప్రాంగాణాలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, సర్పంచ్‌లు పూజారి ఆదిలక్ష్మి, సత్యవతి, గంగాపూనెం శ్రీదేవి, కారం కన్నయ్య, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ అద్దూరి బాబు ఉన్నారు.

ఏడ్జర్లపల్లిలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో గురువారం వైద్యాధికారిని జ్ఞానస ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం పంపించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ కాచి చల్లార్చి, వడ బోసిన నీటిని తాగాలని, దోమ తెరలను వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గోళాలు, డ్రమ్ములపై మూతలు పెట్టుకోవాలని చెప్పారు. స్రవంతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజల కోసమే నూతన భవన నిర్మాణాలు




మాట్లాడుతున్న సర్పంచ్ ఈసం రామ్మూర్తి

ఏటూరునాగారం: ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 379, 380 సర్వే నంబర్ల గల 5.7 ఎకరాల భూమిని గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకున్నామని, ఆ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నూతన గ్రామ పంచాయతీ భవనం కోసం తీర్మానం చేసినట్లు స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అత్యవసర గ్రామసభ నిర్వహించి నూతన గ్రామ పంచాయతీ భవనం, మార్కెట్ నిర్మాణం కోసం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల కోసమే నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎక్కెల రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని, టెండర్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కూరగాయల మార్కెట్‌లో స్థలం పరిశీలిస్తామన్నారు. అదేవిధంగా దివంగత జెడ్పీటీసీ కుసుమ జగదీష్ విగ్రహ నిర్మాణం కోసం స్థలం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ సర్పంచ్‌ను కోరగా స్థలం కోసం పరిశీలిస్తామన్నారు.


ఎంబీ రికార్డులు ఇవ్వండి..

గ్రామ పంచాయతీ పరిధిలో రూ.6 లక్షల వరకు వర్కులు చేశానని, ఇప్పటి వరకు బిల్లులు రాలేదని, దానికి సంబంధించిన ఎంబీ రికార్డులు ఇవ్వాలని వార్డు సభ్యురాలు స్వరూప భర్త సారయ్య గ్రామ సభలో ప్రజాప్రతినిధులను నిలదీశారు. గ్రామ పంచాయతీ అధికారులు తనకు బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని వెంటనే బిల్లులు ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన కార్యదర్శి బిల్లులు వచ్చేవిధంగా చూస్తామని, ఎంబీ రికార్డులు ఇస్తామన్నారు. ఉప సర్పంచ్ కర్ల అరుణ, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు హన్మంతు, స్వప్న, మానస, నాగసాగర్, నాగరాజు, రంజిత్, తుమ్మ మల్లారెడ్డి, రామ నర్సయ్య భిక్షపతి గౌడ్, శంకర్, బెడిక రమేష్, జీపీ సిబ్బంది రవీందర్ వెంకన్న పాల్గొన్నారు.


సీతక్కను ఓడించేందుకు బీఆర్ఎస్ కుట్ర



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న దేవేందర్



వెంకటాపురం(ఎం)లో..



ములుగు రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్కను ఓడించేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సీతక్కను ప్రజలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాటోతు గణేష్, జంగిలి రవి, చక్రపు శ్రీనివాస్, మాడ ప్రకాష్, వీరేష్ నాయక్, కోరె బిక్షపతి, పవన్, మధుకర్, రవి, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతక్క గెలుపును అపలేరు

ఎస్ఎస్‌తాడ్వాయి: బీఆర్ఎస్ పార్టీ మంత్రులు మిడుతల దండుగా వచ్చిన సీతక్క గెలుపు అపలేరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కష్ట సమయాల్లో రాని మంత్రులు, నాయకులు నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మిడతల దండులా వచ్చి సీతక్క టార్గెట్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముగ్గురు మంత్రులు సీతక్క నియోజక వర్గం కోసం వస్తున్నారంటే సీతక్క గారు నైతికంగా గెలిచినట్టే అని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు అరెం లచ్చు పటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, సర్పంచ్ జానకి రాంబాబు, ఎస్సీ సెల్ జిల్లా సీనియర్ నాయకుడు నర్సయ్య, కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, జనార్దన్, గోపాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం

ములుగు రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోపిదాసు ఏడుకొండలు ఆరోపించారు. గురువారం గోవిందరావుపేట మండలంలోని రంగాపూర్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ.. నీళ్లు , నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలోవెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ వాసం కన్నయ్య, రాము, గోపిదాసు రజిత, ప్రమీల, మణి, లక్ష్మీ, దేవమ్మ, జయమ్మ, నాగమణి, సుశీల పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలో మొరుమూరు గ్రామం వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు.